క్లుప్తంగా

రైల్వే గ్రూప్-డీ ఉద్యోగుల పనితీరు భేష్



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): ఇండియన్ రైల్వేలో గ్రూప్-డీ ఉద్యోగుల పనితీరు అభినందనీయమని సౌత్ సెంట్రల్ రైల్వే ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విజయవాడ డివిజన్ అధ్యక్షురాలు డాక్టర్ వర్షాపాటిల్ అన్నారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం(మేడే)ను బుధవారం రైల్వే ఆస్పత్రి వద్ద ఉన్న ఈ-వరల్డ్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ వర్షాపాటిల్ మాట్లాడుతూ ఇండియన్ రైల్వేకి గ్రూప్-డీ ఉద్యోగులు వెన్నెముకలాంటి వారన్నారు. వారే రైల్వేకి నిజమైన హీరోలన్నారు. వారి కృషి, నైపుణ్యంతో ఇండియన్ రైల్వే ముందుకు దూసుకుపోతోందన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 12 మంది గ్రూప్-డీ మహిళ ఉద్యోగులను సత్కరించి వారికి ప్రశంస పత్రాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సంయుక్త కార్యదర్శి వాసంతిక, జాక్ అండ్ జిల్ స్కూల్ కార్యదర్శి శ్రీరమ్య పాల్గొన్నారు.

శ్రీనివాసునికి పంచామృత అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లో వేం చేసిన శ్రీ పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ అనంతరం మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పలువురు ఉభయ దాతలు, భక్తులు పంచామృత అభిషేకాలను తమ పేరిట జరిపించుకున్నారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ, తులసీ దళ అర్చనను ఆలయ అర్చకులు రామరత్నమాచార్యులు జరిపించారు. పూజలో దేవస్థాన కమిటీ, సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులకు ఎస్సీ సెల్ సత్కారం



భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా ఇటీవల నియమితులైన ఆకుల శ్రీనివాస్ కుమార్, జీఎంసీ బాషాలకు పార్టీ ఎస్సీ సెల్ విభాగం నాయకులు విడివిడిగా ఆత్మీయ సత్కారం చేశారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు జోసఫ్ శివమణి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పోలిమెట్ల శరత్, ప్రధాన కార్యదర్శి తాండ్ర ఇంద్ర కుమార్, నగర అధ్యక్షుడు బూదాల శ్రీనివాస్, సిటీ యూత్ ప్రధాన కార్యదర్శి జమలపూడి మార్క్, లేళ్లపూడి లాజర్, ఎద్దు సురేష్, ఎద్దు సురేష్, కె రాజు, ఎస్ సుబ్రహ్మణ్యం, కొమ్ము జోసఫ్, పి. నాగరాజు, ఎం. జ్ఞానయ్య తదితరులు పాల్గొన్నారు.

200 మందికి కంటి పరీక్షలు



పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కాలేజీలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శంకర నేత్ర చికిత్సాలయం సహకారంతో కంటి చూపు పరీక్షలు ఉచితంగా చేశారు. దాదాపు 200 మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్ల జోళ్లు అందజేశారని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చన్నం రాధాకృష్ణ, ఎన్ఎస్ఎస్ వలవటీర్లు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



పాయకాపురం(విజయవాడరూరల్): సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిన్నం రామకృష్ణ అన్నారు. బుధవారం మే డే సందర్భంగా పాయకాపురంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మున్సిపల్ పార్క్, వాకింగ్ ట్రాక్‌ను స్పందన వాకర్స్ క్లబ్ ప్రతినిధులు సందర్శించారు. వాకర్స్ క్లబ్ తరపున సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మజ్జిగ పంపిణీ, చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్ల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో స్పందన వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఇ.కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి వైకే శాస్త్రి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

మాయలు చేయడంలో వారు దిట్ట!

- బ్యాంకుల దొంగకు ప్రజలను మోసం చేయడం పెద్ద లెక్క కాదు
- ప్రజలు వాస్తవాలను గుర్తించి ఓటు వేయాలని అభ్యర్థన
- 54వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో ఆసిఫ్



వృద్ధురాలితో మాట్లాడుతున్న షేక్ ఆసిఫ్, చిత్రంలో కేశినేని శ్వేత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పెద్దపెద్ద జాతీయ బ్యాంకులను మోసం చేసి వేల కోట్లు దోచేసిన సుజనాచౌదరికి పశ్చిమ నియోజకవర్గ ప్రజలను మోసం చేయటం ఓ లెక్కా? అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ విమర్శించారు. 54వ డివిజన్ కార్పొరేటర్ అబ్దుల్ అర్షద్ ఆధ్వర్యంలో షేక్ ఆసిఫ్, ఎంపీ కేశినేని నాని కుమార్తె కేశినేని శ్వేతతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. వించిపేటలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి ప్రారంభమైన ప్రచారం ఆబోతుల వారి వీధి మీదుగా ముందుకు సాగింది. అడుగడుగునా డివిజన్ ప్రజలు షేక్ ఆసిఫ్, కేశినేని శ్వేతలకు అపూర్వ స్వాగతం పలికారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ నవరత్నాలు ప్లస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకు వెళ్లారు. అలాగే స్థానికంగా ఉన్న కోదండరామాలయంలో ఆసిఫ్, శ్వేత, అర్షద్ ఇతర పార్టీ నేతలు కార్పొరేటర్ యలకల చలపతిరావు నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుజనాచౌదరి అంటే పశ్చిమ నియోజకవర్గంలో చాలామందికి తెలియదన్నారు. అయితే బ్యాంకు నుంచి వేల కోట్ల రూపాయాలు దోచుకున్న వ్యక్తిగా ప్రజలకు పరిచయస్తుడని చెప్పారు. ఈ విషయాన్ని తాను చెప్పటం లేదన్నారు. ఇంటర్నెట్‌లోకి వెళ్లి సుజనాచౌదరి మోసాలు అని టైప్ చేస్తే ఆయన చేసిన మోసాలు, కేసులు వంటి అంశాలు బయటకు వస్తున్నాయన్నారు. నరేంద్రమోదీ, సుజనా చౌదరి, బీజేపీ పార్టీ ముస్లిం మైనారిటీలకు చేసిందేమీ లేదన్నారు.



దోసెలు వేస్తూ సందడి చేస్తున్న ఆసిఫ్

వాస్తవాన్ని గుర్తించండి..

కేశినేని శ్వేత మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గం ప్రజలు చైతన్యవంతులని, వాస్తవాన్ని మాత్రమే నమ్ముతారని చెప్పారు. షేక్ ఆసిఫ్ నిరంతరం ప్రజాసేవలో నీతి నిజాయితీగా పనిచేసిన వ్యక్తి అన్నారు. కూటమి అభ్యర్థులంటే గుర్తొచ్చేది ఈడీ కేసులు, బ్యాంకు మోసాలు, స్కామర్లు అన్నారు. గత 10 సంవత్సరాల నుంచి విజయవాడను ఎంతో అభివృద్ధి చేసిన వ్యక్తి కేశినేని నాని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అబ్దుల్ వాహాబ్, అతీక్, ఖాదర్, రమేష్, బాషి, యునస్, శబాషి, పైడాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి సీఎం వైఎస్ జగన్

- వైఎస్ఆర్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గౌతంరెడ్డి
- వైఎస్సార్ సీపీ పశ్చిమ కార్యాలయంలో ఘనంగా మే డే వేడుకలు



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న గౌతంరెడ్డి, పక్కన ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో కార్మిక వర్గానికి పెద్ద పీట వేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని, వాహన మిత్ర పథకం ద్వారా ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ఏటా రూ.10వేలు అందజేస్తుండటమే అందుకు నిదర్శనమని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. కార్మికుల దినోత్సవం సందర్భంగా బుధవారం విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎన్నికల ప్రధాన కార్యాలయంలో వైఎస్సార్‌టీయూసీ నగర అధ్యక్షుడు విశ్వనాథరవి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గౌతంరెడ్డి, వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ హాజరయ్యారు. తొలుత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్సార్‌టీయూసీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతంరెడ్డి మాట్లాడుతూ కార్మిక వర్గానికి కావాల్సిన సదుపాయాలు కల్పించటంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గం పిల్లలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలనే ఉద్దేశంతో తల్లులకు అమ్మ ఒడి పథకం ద్వారా రూ.15వేలు అందించారని చెప్పారు. అదే విధంగా వారి ఆరోగ్యానికి భరోసా ఇస్తూ ఆరోగ్యశ్రీ పథకం, ప్రమాదవశాత్తూ కార్మికుడు చనిపోతే గతంలో అరకొర ఇచ్చే మొత్తాన్ని రూ.5 లక్షలు ఇచ్చిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. ఇటీవల ఆయన విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో ఆ మొత్తాన్ని రూ.10 లక్షల వరకు చేస్తానని ప్రకటించడంపట్ల కార్మికులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అలాగే రోడ్డు ప్రమాదంలో అంగవైకల్యం కలిగినా లేదా ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నా వారికి శాశ్వతంగా రోజుకు రూ.225 చొప్పున రూ.5వేలు పింఛన్ ఇచ్చేలా జగనన్న నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అటువంటి మంచి మనసున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని, అలాగే పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌ను గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు.

కార్మికులకు అండగా..

వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ కార్మికుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి కార్మికుల పక్షపాతిగా నిలిచారని అన్నారు. ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసి అందులోని వేలాది మంది కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించారని గుర్తు చేశారు. వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మెహరాజ్, జోనల్ ఇన్‌చార్జ్ నంబూరు ప్రదీప్, ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్, కార్మికులు గోమతోటి వినోద్ పాల్, మధు, సూర్యప్రకాష్, నర్రెడ్డి, కరిముల్లా, పృథ్వీ, క్రాంతి, నాగిరెడ్డి, ఖాన్, శ్యామ్, రుద్రశంకర్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నిలదీతలతో బెంబేలు..!

ప్రచారంలో రిజర్వేషన్లపై బీజేపీ అభ్యర్థి సుజనాను నిలదీస్తున్న మైనార్టీలు



ప్రచారంలో సుజనాను ప్రశ్నిస్తున్న వ్యక్తి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుజనాచౌదరిని నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న ముస్లిం మైనారిటీలు నిలదీస్తున్నారు. కోట్లాది రూపాయలను కుమ్మరిస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న సుజనాచౌదరి బృందానికి ఏదో ఒక చోట నిత్యం నిలదీతలు ఎదురవుతున్నాయి. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లను తొలగించటంతో పాటుగా అనేక నల్లచట్టాలను తీసుకొస్తుందని అమిత్‌షా వంటి నాయకులు ప్రకటించారని చెబుతూ ఆ విషయాలను ఆయా నాయకుల ముందు పెట్టి సమాధానాన్ని అడుగుతున్నారు. తమకు అన్యాయం చేయాలని చూస్తున్న బీజేపీకి ఎందుకు ఓటు వేయాలి? అంటూ వారు నిలదీయంతో బీజేపీ నాయకులు అవాక్కవుతున్నారు.

ప్రతిపక్షాల కుట్రలంటూ బుకాయింపు

నియోజకవర్గంలో ముస్లింలు, దళిత వర్గాలు అధికంగా ఉండే వించిపేటలో ఇటీవల సుజనాచౌదరి తన బృందంతో ప్రచారాన్ని నిర్వహించారు. ఆ క్రమంలో సుజనాకు ఎదురుపడిన ఒక ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తిని ఓటు అభ్యర్థించాడు. దాంతో ఆ వ్యక్తి వెంటనే రిజర్వేషన్లు ఇతర అంశాలపై పలు ప్రశ్నలను ఎక్కు పెట్టారు. తాము బీజేపీకి ఓటు వేయమంటూ తెగేసి చెప్పటంతో సుజనాచౌదరి ఒక్కసారిగా బిగుసుకుపోయారు. ఆ తర్వాత తేరుకొని అదేమి లేదంటూ సమాధానం చెప్పటం ప్రారంభించారు. ఇదంతా ప్రతిపక్షాలు భారతీయ జనతా పార్టీపై చేస్తున్న దుష్ప్రచారమని, ముస్లింలకు తమ పార్టీ అండగా ఉంటుందంటూ అతనిని సముదాయించే ప్రయత్నం చేశారు.

కుటుంబ సభ్యులకూ తప్పడంలేదు

పశ్చిమంలో పోటీ చేస్తున్న సుజనాచౌదరికి, పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తున్న కేశినేని చిన్నికి మద్దతుగా వారి కుటుంబ సభ్యులు సైతం నియోజకవర్గంలో ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో భవానీపురంలో ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతంలో వారిని సైతం మైనార్టీ వర్గానికి చెందిన మహిళలు రిజర్వేషన్లపై నిలదీశారు. తమకు రిజర్వేషన్లను రద్దు చేయాలని చూస్తున్న బీజేపీకి తామెలా ఓటు వేస్తాం? అంటూ ప్రశ్నించారు. ఈ ఎదురు ప్రశ్నలకు అభ్యర్థుల కుటుంబ సభ్యులు సైతం బిత్తరపోయారు.

ఆసిఫ్‌కు ఆజాద్ రాష్ట్ర కమిటీ మద్దతు



మద్దతు తెలుపుతున్న ఆజాద్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న షేక్ ఆసిఫ్‌కు ఆవాజ్ ముస్లిం కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల్‌మీరా తెలిపారు. ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆసిఫ్‌ను నాగుల్‌మీరా కలిసి మద్దతు ప్రకటించారు. షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ మంచి మనసున్న వ్యక్తి ఏ సమస్య చెప్పిన స్పందించి పనిచేసే నాయకుడు ఆసిఫ్ అన్నారు. అంతేకాకుండా ఆసిఫ్ స్థానికుడు, ముస్లింలకే కాకుండా అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే వ్యక్తి షేక్ ఆసిఫ్ అన్నారు. ముస్లిం వర్గాలను అత్యంత దారుణంగా మోసగిస్తున్న సుజనాచౌదరిని చిత్తుచిత్తుగా ఓడించి ఆసిఫ్‌ను, ఎంపీ అభ్యర్థి కేశినేని నానిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. నాలుగు శాతం ఉన్న ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేయటానికి ప్రయత్నిస్తున్న కూటమిని తరిమికొట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ, సెంట్రల్ నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు అన్వర్ బేగ్, సెంట్రల్ సహాయ కార్యదర్శి సిలార్ బేగ్ తదితరులు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జానపద గీతాలు, నృత్యాలు



జానపద గీతాలకు నృత్యాలు చేస్తున్న చిన్నారులు

విజయవాడకల్చరల్: దామోదర జానపదం-మామ్ ట్రస్ట్ ఆధ్వర్యాన కార్మిక దినోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన జానపద గీతాలు, నృత్య కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమాలను మామ్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాంతి వాసుదేవరావ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జానపదం జనపదమని తెలిపారు. శ్రామిక జీవనంలోనే శక్తి దాగి ఉంటుందన్నారు. అంతర్జాతీయ గాయకుడు దామోదర గణపతిరావు మాట్లాడుతూ సంస్థ ద్వారా అనేక మంది గాయకులను పరిచయం చేసినట్లు తెలిపారు. కవులు, గాయకులు మాతృభాషా వికాసానికి కృషి చేయాలని సూచించారు. లలిత, కుసుమాంజలి, సుశీల, రమణ, తేజ, మనస్విని, చందు, పాదుషా, దివ్యశ్రీ, హిమశ్రీ, సహస్రసాహితి, దివ్యలత పలు జానపద గీతాలను ఆలపించారు. నెలిబండ్ల బాలస్వామి, కోట్ల శివశంకరరావు, వేద గంగోత్రి, వరప్రసాద్, అంబటి మధుమోహన కృష్ణ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

నేడు కొబ్బరి చిప్పలకు బహిరంగ వేలం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో భక్తులు మొక్కులు తీర్చుకునే కొబ్బరి చిప్పలకు బహిరంగ వేలం గురువారం నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం.గంగాధరరావు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ గురువారం సాయంత్రం 4 గంటలకు సంవత్సరం కాలపరిమితికి ఆలయంలో కొబ్బరి చిప్పలు సేకరించుకోవటానికి బహింగ వేలం నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రాలలో తగిన సౌకర్యాలు కల్పించాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ పరిధిలోని గొల్లపూడి, నల్లకుంట, జక్కంపూడి వైఎస్సార్ కాలనీ ప్రాంతాలలోని పోలింగ్ కేంద్రాలను మైలవరం అసెంబ్లీ నియోజకవర్గం సాధారణ పరిశీలకులు నరేందర్ సింగ్ బాలి బుధవారం పరిశీలించారు. ఈ నెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఆయా పోలింగ్ కేంద్రాలలో చేసిన ఏర్పాట్లను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాలలో తగినంత వెలుతురు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లతోపాటు అవసరమైన ప్రదేశాల్లో షామియానాలు వంటి కనీస సౌకర్యాలను కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఓటు ప్రాముఖ్యత, ఓటర్ బాధ్యత, ఓటు హక్కు ఏ విధంగా వినియోగించుకోవాలి అన్న అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

సీఎం జగన్‌తోనే రజకుల అభ్యున్నతి



సమావేశంలో పాల్గొన్న గాడ్గే బాబా ఐలమ్మ సామాజిక సేవా సంఘం నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రజకుల సమగ్ర అభివృద్ధి జరిగిందని కావున సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రజకులు అండగా ఉండాలని గాడ్గే బాబా ఐలమ్మ సామాజిక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి తిరుపతిరావు అన్నారు. దుర్గాపురంలో బుధవారం గాడ్గే బాబా ఐలమ్మ సామాజిక సేవా సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రజకుల అభివృద్ధి, సంక్షేమానికి జగనన్న చిత్తశుద్ధితో పనిచేశారని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రజక సామాజిక భవనాలు, దోభీఘాట్ల పరిరక్షణ, ముఖ్యంగా రజక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా రజకుల ఆత్మ గౌరవం ఇనుమడింపచేశారని పేర్కొన్నారు. సంఘం కార్యదర్శి అంజూరి సత్యనారాయణ మాట్లాడుతూ విజయవాడ నగరంలో ఐలమ్మ సామాజిక భవన్, ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు దోభీఘాట్‌లకు నిధులు మంజూరు చేశారని తెలిపారు. సంఘం సంయుక్త కార్యదర్శి కొండాయగుంట రాము మాట్లాడుతూ రాష్ట్రంలోని రజకులు అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి జగనన్న ముఖ్యమంత్రిగా తిరిగి ఎన్నిక అయ్యేవిధంగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. నగరంలో ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థులు వెలంపల్లి శ్రీనివాసరావు, దేవినేని అవినాష్, ఆసిఫ్‌లను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో కొండపల్లి వెంకటేశ్వరరావు, సామంతకూరి దుర్గారావు, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా సేవలు అభినందనీయం

- విలక్షణమైన పనితీరుతో అధికారులను మెప్పించారు
- జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



సాయిబాబాను సత్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాచార, పౌరసంబంధాల శాఖలో ప్రచార సహాయకుడు, ఆడియో విజువల్ సూపర్‌వైజర్‌గా 33 ఏళ్ల పాటు సేవలందించిన ఆగం సాయిబాబా సేవలు అభినందనీయమని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ఆయన తన విలక్షణమైన పనితీరుతో అధికారులను మెప్పించారని కలెక్టర్ పేర్కొన్నారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఆడియో విజువల్ సూపర్‌వైజర్ (ఏవీఎస్)గా పనిచేసి మంగళవారం పదవీ విరమణ చేసిన ఆగం సాయిబాబాను కలెక్టర్ ఢిల్లీరావు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాచార శాఖలో తనదైన శైలిలో విధులు నిర్వర్తించి.. శాఖకు మంచి పేరు తీసుకొచ్చేలా సాయిబాబా పనిచేశారన్నారు. ఛాయాచిత్ర ప్రదర్శనలు ఏర్పాటు చేయడం వంటి విషయాల్లో ఆయన మంచి ప్రతిభ కనబరిచారని కలెక్టర్ ఢిల్లీరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఐపీఆర్‌ఓ యు.సురేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్వీ మోహన్‌రావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, పబ్లిసిటీ సహాయకుడు వీవీ ప్రసాద్, జిల్లా సమాచార శాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో వేసవి ఏర్పాట్లు



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సిబ్బంది



పక్షుల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి పాత్రలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పెరుగుతున్న ఎండలతో ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భక్తులు నడుచుకుంటూ వచ్చే కనకదుర్గనగర్ మహా మండపం మార్గంలో పీచుతో ఏర్పాటు చేసిన కార్పెట్లు ఏర్పాటు చేయడంతో పాటు చలువ పందిళ్లు ఏర్పాటు చేసింది. ఇక అమ్మవారి ఆలయంలో చలువ పందిళ్లు, ఓం టర్నింగ్ మొదలు ఆలయం వరకు పలు చోట్ల మంచినీటి సదుపాయాన్ని కల్పించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మంచినీటి చలివేంద్రాలలో తాగునీటిని అందిస్తుండగా, మధ్యాహ్నం 12 గంటల నుంచి రెండు గంటల వరకు దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. భక్తులతో పాటు ఇంద్రకీలాద్రి కొండపై ఉండే మూగజీవాలకు మంచినీటిని అందించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈవో కేఎస్ రామరావు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పలు చోట్ల కోతులకు, పావురాల కోసం ప్లాస్టిక్ గిన్నెలను ఏర్పాటు చేసి మంచినీటిని అందిస్తున్నారు.

కవిత్వం సామాజిక అంశాల సమాహారం



కవిత 2023 ఆవిష్కరణ సభలో వేణుగోపాల్, మాధవరావు, ప్రసూన, అనిల్‌డ్యాని తదితరులు

విజయవాడకల్చరల్: కవిత్వం సామాజిక అంశాల సమాహారమని సాహితీవేత్త ఎస్.వేణుగోపాల్ అన్నారు. కార్మిక దినోత్సవం సందర్భంగా సాహితీ మిత్రులు ప్రచురించిన కవిత 2023, లెనిన్ కావ్యం (తెలుగు అనువాదం) ఆవిష్కరణ సభను విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో బుధవారం నిర్వహించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ కవిత్వానికి సామాజిక ప్రయోజనం ఉండాలని కవిత్వం ప్రజల గుండె చప్పుడు నుంచి లావాలా రావాలని సమాజాన్ని మార్చే శక్తి కవిత్వానికే ఉంటుందన్నారు. సాహితీ మిత్రులు ఈ విషయంలో పూర్తిగా విజయం సాధించినట్లు తెలిపారు. కవిత 2023 సంకలనాన్ని బాలాంత్రపు ప్రసూన, లెనిన్ కావ్యాలన్ని అద్దేపల్లి ప్రభు ఆవిష్కరించారు. సంపాదకుల పక్షాన కవి బండ్ల మాధవరావు మాట్లాడుతూ ప్రజలతో మమేకమైనదే సాహిత్యమని అన్నారు. సాహితీ మిత్రులు 23 సంవత్సరాలుగా ప్రతి ఏటా మే ఒకటోతేదీన క్రమం తప్పకుండా కవితా సంపుటిని ప్రచురిస్తోందని తెలిపారు. కవి అనిల్ డ్యాని సభను ప్రారంభించారు. అతిథులు కవితా సంపుటిని ఆవిష్కరించారు. కవిత 2023 సంకలనంలోని కవులు స్వీయ కవితాగానం చేశారు. శ్రీరాం పుష్పాల నిర్వహించారు. సాహితీ మిత్రులు కీలక బాధ్యుడు విశ్వేశ్వరరావుతోపాటు పలువురు సాహితీ మిత్రులు పాల్గొన్నారు.

మహిళలను వ్యాపారాల్లో ప్రోత్సహించడమే లక్ష్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జంధ్యాల శంకర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళలను వృత్తి, వ్యాపారాల్లో ప్రోత్సహించడమే లక్ష్యంగా ఆర్కే ఫౌండేషన్ పనిచేస్తోందని ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఉమా నవీన అన్నారు. భవానీపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డులోని ఎస్ కన్వెన్షన్‌లో ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృత్తి, వ్యాపారాల్లో రాణించేందుకు మహిళలకు ముద్రా రుణాలు మంజూరు చేయించడం, సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఫౌండేషన్ చైర్మన్ రాధాకృష్ణ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ గతంలో అనేక రకాలైన సేవ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. మాజీ మేయర్ జంధ్యాల శంకర్ మాట్లాడుతూ మానవాభివృద్ధి జరగాలంటే మహిళాశక్తి పెంపొందాలని పేర్కొన్నారు.